

నగర కేంద్ర గ్రంథాలయాన్ని శుభ్రం చేయడానికి వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గ్రంథాలయాన్ని శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పలు కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం, నగరంలోని 10 శాఖా గ్రంథాలయాలను మంగళవారం శుభ్రం చేశారు. 55వ ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు గంటల పాటు గ్రంథాలయంలోని గదులు, ఆవరణ, పుస్తకాలను శుభ్రం చేశారు. నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, డిప్యూటీ కార్యదర్శి పల్లవి, ఎన్ఎస్ఎస్ స్టేట్ ఆఫీసర్‌లు నర్సింగ్‌గౌడ్, అన్నపూర్ణ, లైబ్రరీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణస్వరూప్ తదితరులు

వర్గీకరణ, క్రీమీలేయర్ అమలుకు వ్యతిరేకంగా

30న సచివాలయ ముట్టడి

కవాడిగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని దళితులంతా విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. మంగళవారం కేంద్ర కార్యాలయంలో సచివాలయ ముట్టడి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయాన్ని ముట్టడిస్తామన్నారు. వర్గీకరణ, క్రీమీలేయర్ అమలు కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వాడాల భాస్కర్, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుచంద్ర, దళిత బహుజన పార్టీ గ్రేటర్ నాయకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఫీడర్లలో మరమ్మతులు కారణంగా హైదరాబాద్ సిటీ 1 పరిధిలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. శాంతాబాయి నర్సింగ్ హోం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, గాంధీనగర్, బాలాజీ ఇంద్రప్రస్థ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రేణుకా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

పాడిరైతుల ధర్నాను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సమస్యలపై విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడి రైతులకు 15 రోజులకొకసారి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరిబండి ప్రసాదరావు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి. సాయిబాబా

హైడ్రా పేరుతో పేదల ఇళ్ల కూల్చివేత తగదు

రాంనగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం తగదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. మంగళవారం దోమలగూడలో పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, నాలాల పరిరక్షణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలు స్థలాలు ఆక్రమించి కట్టిన భవనాలను, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని భవనాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు నాగు నగేష్, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సురేందర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాదిగ రాజ్యాధికార పోరాట సమితి నాయకులు

మాదిగల త్యాగ ఫలితం వల్లే ఎస్సీ వర్గీకరణ

ముషీరాబాద్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మాదిగల త్యాగ ఫలితం వల్లే ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ రాజ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన సురేందర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవీన్‌రాజ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన వారి జ్ఞాపకార్థం అమరవీరుల స్తూపాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ రాజ్యాధికార పోరాట సమితి నాయకులు ప్రవీణ్, నర్సింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ సైంటిస్ట్ వేదానందశర్మ కన్నుమూత



వేదానందశర్మ (ఫైల్)

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైంటిస్ట్ చామర్తి వేదానంద శర్మ(73) అనారోగ్యంతో మంగళవారం కన్ను మూశారు. బాలానగర్ ఐడీపీఎల్‌లో 20 సంవత్సరాలపాటు సైంటిస్ట్‌గా పనిచేశారు. ఫార్మా పరిశ్రమల స్థాపనలో సలహాలు ఇచ్చారు. జహీరాబాద్, షోలాపూర్‌లలో వేదానందశర్మ సలహాలతో ప్రభుత్వాలు కంపెనీలు ఏర్పాటు చేశాయి. వేదానందశర్మ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు సాయిచంద్, రాజ్‌మోహన్, వై. సంజీవరెడ్డి, కవి దీవి సుబ్బారావు, గౌరీశంకర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

లోతట్టు ప్రాంతాలు

జలమయం

- రోడ్లపై నిలిచిన నీరు
- వాహనదారుల ఇబ్బంది

ముషీరాబాద్/రాంనగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి ముషీరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు. పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారింది. బాప్టిస్ట్ చర్చి వీధి, రామాలయం, పార్సీగుట్ట ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. రాజాడీలక్స్ చౌరస్తా, బాపూజీనగర్‌లో వాహనదారుల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. బాకారం ప్రధాన రహదారిలో నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. వీఎస్టీ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తాలో వర్షపు నీరు నిలిచింది. గోల్కొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ అయింది.



బురద మయంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం



బాప్టిస్ట్ చర్చి వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



గోల్కొండ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్



బాకారంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

డ్రగ్స్, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. మంగళవారం రామకృష్ణ మఠంలోని బాలల సేవా విభాగంలో నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మతి మరుపు అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు యోగా పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మతి మరుపు అనే వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ఉపన్యాస పోటీలు దోహదపడతాయన్నారు. డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నిద్ర లేకపోవడం, మానసిక ఒత్తిడితో ఆందోళన పెరుగుతుందన్నారు. ఆరోగ్య కరమైన ఆహారం, శారీరక వ్యాయామం, కొత్త విషయాలను నేర్చుకోవడం తదితర అంశాలు మెదడును ఉత్తేజపరిచే పనులవైపు దృష్టి మళ్లిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రఘునందన్ మహరాజ్, పి స్వరూపరాణి, శోభారాణి, హారతి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హిప్నో పద్మాకమలాకర్

ఘనంగా హెబ్రోన్ చర్చి వ్యవస్థాపక దినోత్సవం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చి వ్యవస్థాపక దినోత్సవాన్ని గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని చర్చి ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంఘ పెద్దలు బ్రదర్ వైట్ జాన్ సుబ్బారెడ్డి, సి. జోసెఫ్ కురియన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. బ్రదర్ భక్తసింగ్ ఆశయాలను కొనసాగిస్తూ హెబ్రోన్ చర్చికి పూర్వవైభవం తీసుకురావడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. రేవంత్‌రెడ్డి పాలన విజయవంతంగా కొనసాగాలని చర్చిలో ప్రార్థనలు చేసినట్లు ఆయన తెలిపారు. జేసీ రావు, డి. రాజేశ్వర్‌రావు, జాన్ స్టువర్ట్, అద్దంకి ఇమాన్యుయేల్, పీటర్ ఫ్రాన్సిస్, ఏసుపాదం, సామ్యేల్ జకరయ్య, దేశవ్యాప్తంగా ఉన్న హెబ్రోన్ చర్చిల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఇకమీదట ఎవరూ సొసైటీ, చర్చి అని గొడవలు పడొద్దని వారు సూచించారు.



కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు, తదితరులు

అనుకూలురే పాల్గొన్నారు

హెబ్రోన్ చర్చిలో చర్చి వ్యవస్థాపక దినోత్సవం పేరిట నిర్వహించిన ఏకపక్ష సమావేశంలో కేవలం ట్రస్ట్ సభ్యులు, అనుకూల హెబ్రోన్ సేవకులు మాత్రమే పాల్గొన్నారని క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేము మత్తయ్య పేర్కొన్నారు. వారితోపాటు నాన్ పాస్టర్లు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ గుంటూరు, కడప తదితర రాయలసీమ ప్రాంతంలోని వారు మాత్రమే పాల్గొనడం దురదృష్టకరమన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన గోల్కొండ క్రాస్‌రోడ్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిజమైన హెబ్రోన్ సొసైటీ వారు ఎవరూ సమావేశంలో పాల్గొనకపోవడం విచారకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ప్రోద్బలంతో ఎఫ్‌సీఎస్ పీటర్ జాన్ సుబ్బారెడ్డి వర్గం ఆధిక్యతను చాటుకోవడానికే సమావేశం నిర్వహించారని ఆరోపించారు. సమావేశంలో రాజకీయాలు మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు.

డిసెంబర్ 27 నుంచి కూచిపూడి నృత్య స్వర్ణోత్సవాలు

రాంనగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య స్వర్ణోత్సవాలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని సంకల్పించామని కూచిపూడి నృత్య గురువు డాక్టర్ వేదాంతం వెంకటాచలపతి అన్నారు. వేదాంతం పార్వతీశం 104వ జయంతి సందర్భంగా మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కూచిపూడి నృత్య గురువుల తెలుగు రాష్ట్రాల సమ్మేళనం కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు కూచిపూడి నృత్యం దేవాలయాలకు పరిమితమై, పురుషులు మాత్రమే ప్రదర్శించేవారన్నారు. కాలానుగుణంగా మార్పులు చేసి ఈ నాట్యాన్ని స్త్రీలు కూడా ప్రదర్శించేలా అభివృద్ధి చేశారన్నారు. కూచిపూడి స్వర్ణోత్సవాలను డిసెంబర్ 27 నుంచి 29 వరకు కూచిపూడి నాట్య క్షేత్రం మొవ్వ మండలం, కృష్ణా జిల్లాలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏలేశ్వరం చలపతిశాస్త్రి, మృత్యుంజయశర్మ, సత్యప్రసాద్ భాగవతుల సేతురాం, రామలింగేశ్వర శాస్త్రి, డాక్టర్ సుమిత్ర, రమణిసిద్ధి, ఇందిరా పరాశరం తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

రచనలతో సాంఘిక చైతన్యానికి దోహదం చేసిన గురజాడ

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అనే గీతం నినాదంగా నేటికీ నిలిచి ఉందని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదిలో సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగమారుతీశర్మ మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు రచించిన పుత్తడిబొమ్మ పూర్ణమ్మ కవితలో డబ్బుకోసం పదేళ్ళ కూడా నిండని కుమార్తెను తండ్రి అరవైఏళ్ళ వృద్ధుడికి ఇచ్చి వివాహం చేయడం దురాచారాన్ని కన్యాశుల్కం నాటకంలో చూపారన్నారు. నాటి బ్రాహ్మణ సామాజికవర్గాల్లో ఉన్న అంధ ఆచారాలను ఖండిస్తూ రచనలు చేసి సాంఘిక చైతన్యానికి దోహదం చేశారన్నారు. తెలుగు భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు సుబ్బారావు కాగా అభ్యుదయ సాహిత్య వైతాళికుడు గురజాడ అప్పారావు అని డా. సి. నారాయణరెడ్డి తన పరిశోధనా గ్రంథంలో పేర్కొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సాహితీవేత్త శైలజామిత్ర, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి, న్యాయవాది శ్రీలతవర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ నాగమారుతీశర్మ

శాస్త్రీయ సంగీతం, లలిత కళలు సంస్కృతికి నిదర్శనం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సంగీతం, నృత్యరీతులు, లలితకళలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని పలువురు వక్తలు అన్నారు. నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 49వ అఖిలభారత సంగీతం, నృత్య పోటీలు మంగళవారం కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుకు చెందిన కళాకారులు పోటీలో పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యంతోపాటు పలు శాస్త్రీయ కళలను ప్రదర్శించారు. దీంతోపాటు శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో సంగీత పోటీలు నిర్వహించారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో శాస్త్రీయ కళల్లో పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు.

మబ్బులు కమ్మిన స్టీల్ బ్రిడ్జి



మబ్బులు కమ్ముకోవడంతో మంగళవారం పగలే చీకటిమయమైన స్టీల్ బ్రిడ్జి



మాట్లాడుతున్న వీహెచ్

తిరుమల లడ్డూ ఘటనపై

సీబీఐతో విచారణ జరిపించాలి : వీహెచ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): భగవంతుడి దగ్గర కూడా అవినీతికి పాల్పడడం దౌర్భాగ్యమని, సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోగల టీటీడీ వెంకటేశ్వరస్వామిని ఆయన మంగళవారం దర్శించుకున్నారు. అక్కడే దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తిరుమలలో లడ్డూ తయారీ ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. ప్రపంచంలోనే వెంకన్న లడ్డూకు పవిత్రత ఉందని, లడ్డూలో జంతువుల కొవ్వు కలపడం దారుణమన్నారు. తిరుమలలో దేవుడిపై ఒట్టు వేస్తూ రాజకీయం చేస్తున్నారని అన్నారు. సీబీఐతో విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, తాను చేసే దీక్షతో అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం రావాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ సంఘం సభ్యులు

తెలుగు విశ్వవిద్యాలయానికి

పొట్టి శ్రీరాములు పేరు తొలగించకుండా కృషి చేస్తా

రాంనగర్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించకుండా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పూర్వ అధ్యక్షుడు కె. రాజశేఖర్‌గుప్తా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ.. తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్యవైశ్య సంఘం రాంనగర్ అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్‌గుప్తా, నాయకులు సత్యవర్ధన్, పి. కృష్ణమూర్తి, ఏ. ఆంజనేయులు, ఎర్రం శేఖర్, ఎర్రం శ్రీనివాస్, ప్రకాష్, రవీందర్ ఉన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ నళిని, అప్సా ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ డాక్టర్ నళిని సూచించారు. మంగళవారం దోమలగూడ బండానగర్ కమ్యూనిటీహాల్‌లో ఫ్యామిలీ ప్లానింగ్ ఇండియా సంస్థ, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ పరీక్షల ద్వారా తొలిదశలోనే వ్యాధిని గుర్తించి నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా డివిజన్, బస్తీ కమిటీ అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్, అప్సా సంస్థ ప్రతినిధులు బొట్టు రమేష్, శ్రావణి, లావణ్య, ఫ్యామిలీ ప్లానింగ్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వనిత, జీవన్, అనూష, నారాయణమ్మ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

బీజేపీ సభ్యత్వ నమోదులో..

గ్రేటర్‌ను రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతాం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో గ్రేటర్‌ను రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతామని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతీ యువకులు, మహిళలు, ఉన్నత విద్యావంతులు, మేధావులు బీజేపీలో చేరడానికి ముందుకు వస్తున్నారని, ఇది శుభపరిణామమని అన్నారు. సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు. సభ్యత్వం పెరిగితేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ. సూర్యప్రకాష్‌సింగ్, నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, నాయకులు ప్రవీణ్, సురేష్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశంను సత్కరిస్తున్న యూనియన్ నేతలు

ఆటో, క్యాబ్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్, మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఇటీవల జరిగిన మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. జలమయ్య, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకటేశం, గౌరవ సలహాదారులుగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గౌరవాధ్యక్షుడిగా ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వీఎస్ బోస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ ఇమ్రాన్, ఉపాధ్యక్షులుగా ఎండీ ఒమర్‌ఖాన్, ఏ. భిక్షపతియాదవ్, ఉప ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా బత్తుల సత్యానారాయణ, బి. తిరుమలేష్‌గౌడ్, జి. వెంకటేష్, సీహెచ్. జంగయ్య, టి.రాములు, కె.చందుయాదవ్, బి. రాజుగౌడ్, పి. నర్సిరెడ్డి, కోశాధికారిగా ఎస్. అశోక్‌తోపాటు 30 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశంను సత్కరించారు.

సెల్‌ఫోన్ చోరీ చేసి.. ఫోన్‌పే ద్వారా రూ. 25 వేలు కాజేత

బర్కత్‌పుర, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఓ వ్యక్తి ఫోన్ పే ద్వారా రూ. 25 వేలు కాజేశాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన షేక్ షాన్వాజ్(23) ఈనెల 6వ తేదీన నగరానికి వచ్చి రాత్రి 7 గంటల సమయంలో గుంతకల్-బోధన్ ఎక్స్‌ప్రెస్ రైలును కాచిగూడలో ఎక్కాడు. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో షాన్వాజ్ రైలులో జనరల్ బోగి డోర్ వద్ద నిలబడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తి అతడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని నడుస్తున్న రైలు దూకి పారిపోయాడు. ఫోన్ పే ద్వారా షాన్వాజ్ బ్యాంక్ ఖాతాలోని రూ. 25 వేలు కాజేశాడు. బాధితుడు మంగళవారం బోధన్ నుంచి నగరానికి వచ్చి కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.